క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో గణపతి సుబ్రహ్మణ్య సహిత అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. అగ్ని హోమం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామీ శ్రీనివాసానంద, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి: ఖరీఫ్ వరి సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయశాఖ ఏడీ బొడ్డేపల్లి రాజగోపాలరావు తెలిపారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొండవలస గ్రామంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో నూతన వ్యవసాయ పోకడలు, విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపల పెంపకం, పశుపోషణ, కోళ్ల పెంపంకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త చింతాడ బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శైలజ, ఏఈఓ రాము, భారత వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళలు

నరసన్నపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ క్యాంపైన్‌లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం మహిళలకు పర్యావరణంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొక్కలు అధికంగా నాటి వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం వంటి చర్యలతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


పశువుల అక్రమ రవాణా అడ్డగింత



పట్టుకున్న పశువుల వ్యాన్

నరసన్నపేట: జాతీయ రహదారిపై పశువులతో అక్రమంగా వెళ్తున్న (మినీ లారీ) వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మడపాం టోల్ గేట్ వద్ద గురువారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ వాహనం తిలారు నుంచి మండపేటకు వెళ్తుండగా టోల్ గేట్ వద్ద గుర్తించి అడ్డుకున్నారు. దీంట్లో ఐదు పశువులు (గేదెలు) ఉన్నట్లు గుర్తించి నరసన్నపేట పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ప్రసాదరావు

కొత్తూరు: మండల కేంద్రంలోని శ్రీకాకుళం రోడ్డులో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. గతంలో వాహనాలకు విధించిన జరిమానాలను వసూలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, సీ-బుక్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు తీసుకురావాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ప్రధానంగా నదీతీర గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, సర్వేయర్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి కక్ష .. పేదలకు శిక్ష

- కలగా మిగులుతున్న సొంతిల్లు
- ఏడాది నుంచి నిలిచిన నిర్మాణాలు
- నిధులు, మెటీరియల్ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో లబ్ధిదారులు



గాజులకొల్లివలస లే అవుట్‌లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు



గాజులకొల్లివలసలో గత ప్రభుత్వం హయాంలో నిర్మించి జగనన్న కాలనీ

ఆమదాలవలస:

కూటమి ప్రభుత్వం చర్యలతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. అర్హులైన పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మొదట విడత కింద ఎంపిక చేసిన వారికి అవసరమైన మెటీరియల్, నిధులను సమకూర్చింది. దీంతో పేదలు సంతోషంగా నిర్మాణాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ ఆపేశారు. మెటీరియల్, నిధులు సమకూర్చకపోవడంతో ఏడాదిగా నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇళ్ల స్థలాల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు ప్రక్రియ నిలిపివేసింది.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయానికి గండి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాలకు సంబంధించి 18,613 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో 11,795 మంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేశారు. మిగిలిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో జరగడంతో ప్రస్తుతం అరకొరగా నిర్మాణాలు చేపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాల వారిగా మంజూరైన జగనన్న ఇళ్లు, నిధుల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన మంజూరు ఇళ్లు	నిధులు (కోట్లలో)
ఆమదాలవలస	8,898	5,666	రూ.108.49
పాతపట్నం	3,110	1,670	రూ.49.28
నరసన్నపేట	6,605	4,459	రూ.81.56

ఏడాదిగా నిధులు మంజూరు చేయలేదు



ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస లే అవుట్‌లో గత ప్రభుత్వంలో మా అమ్మ పేరుతో ఇల్లు మంజూరు చేశారు. అది నా పేరు మీద మార్చాలని కోరాను. దాన్ని మార్చినట్లు అధికారులు చెప్పారు. ఏడాది కాలంగా ఇల్లు నిర్మించుకుంటాను.. నిధులు మంజూరు చేయాలని అటు అధికారులు, ఇటు పాలకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. నేను అద్దె ఇంట్లో ఉంటున్నాను. నిరుపేదని, పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. అధికారులు, పాలకులు స్పందించి నాకు సొంతింటి కల నెరవేరేలా చేయాలని కోరుతున్నారు.

– పెరంబుదూర్ కిశోర్, 20వ వార్డు, వెంగళరావు కాలనీ, ఆమదాలవలస మున్సిపాలిటీ

నిధుల మంజూరుకు ఇంత జాప్యమా..



కాలనీల నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు చేయడంలో ఇంత జాప్యం చేస్తే ఎలా. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చి, నిర్మాణ బాధ్యత కూడా తీసుకుంది. పేదవాడు ఇంట్లో దిగేవరకు బాధ్యత వహించింది. గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారు చక్కగా సొంత ఇళ్లల్లో ఉన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. గ్రామ, పట్టణ ప్రజలు, ఇళ్లులేని వారు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇళ్లు కడుతున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలి.

– మామిడి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, బొడ్డేపల్లిపేట, ఆమదాలవలస మండలం

నెల రోజుల్లో అభివృద్ధి చేస్తాం



ఆస్పత్రి ముందున్న బురదను తప్పించుకొని పక్క నుంచి వస్తున్న డీసీహెచ్, ఈఈ, తదితరులు



ఆస్పత్రి అదనపు భవనాలను పరిశీలిస్తున్న డీసీహెచ్, ఈఈ, తదితరులు

సాక్షి ఎఫెక్ట్...

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి పరిసరాలను నెల రోజుల్లో అభివృద్ధి చేస్తామని, ఆస్పత్రి ముందు భాగంలో వీలున్నంత తొందరగా రోడ్డు వేస్తామని ఏపీఎంఎస్ఐడీ ఈఈ సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. బురదమయంగా ఉన్న ఆస్పత్రి పరిసరాలు, గోతులమయంగా ఉన్న ఆస్పత్రి ముందు రోడ్డు దుస్థితిని సాక్షిలో గురువారం ప్రచురితం కావడంతో అధికారులు వెంటనే స్పందించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కళ్యాణ్ బాబు, ఆస్పత్రి కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రి ముందు ఉన్న బురద, అధ్వాన పరిస్థితులు చూసిన డీసీహెచ్, ఏపీఎంఎస్ఐడీ.. ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. మీరు పనులు సకాలంలో పూర్తిచేయకపోవడం వలన తాము ఇబ్బందులు పడుతున్నామని, పైఅధికారులకు సమాధానాలు చెప్పుకోవాల్సి వస్తుందన్నారు. భవనాలు ఎప్పటికి అప్పగిస్తారు. ఇంటర్నల్ రోడ్లు, ఇతర పనులు ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని ఇంజినీర్లకు ప్రశ్నించారు. బిల్లులన్నీ చెల్లించినా పనులు ఆలస్యం చేయడం పట్ల కాంట్రాక్టర్ తీరును డీసీహెచ్ తప్పుబట్టారు. ఒకవైపు కోవిడ్ వేరియంట్లు కొత్తవి వస్తుంటే ఆస్పత్రి పరిసరాలు ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రధాన భవనంలో పనులు తొందరగా పూర్తిచేయాలని, ఇంటర్నల్ రోడ్లు తొందరగా వేయాలని, పైపులైన్లు పూర్తిస్థాయిలో బాగు చేయాల్సిన అవసరాన్ని డీసీహెచ్, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి ఆస్పత్రి ఏఓ రమణమూర్తి తీసుకువెళ్లారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 135 దరఖాస్తులు

నరసన్నపేట: మండలంలో 83 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి 135 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలో 116 ఖాళీలు ఉన్నాయని ఎంఈఓ శాంతారావు గురువారం తెలిపారు. సుందరాపురం, బాడాం, ఉర్లాం, లుకలాం, దేశవానిపేట ఉన్నత పాఠశాలలకు హెచ్ఎంలను నియమించామన్నారు. వీరు 31న రిలీవ్ అయి జూన్ ఒకటిన ఆయా స్కూళ్లలో జాయిన్ అవుతారని తెలిపారు.

నేటి నుంచి గ్రామదేవత మహోత్సవాలు

పాతపట్నం: ఈ నెల 30 నుంచి జూన్ 3వ తేదీ వరకు మండలంలోని చిన్నలోగిడిలో గల జడ్డమ్మ గ్రామ దేవత పండగ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 30న దేవర తీసుకురావటం, అమ్మవారి ప్రత్యేక పూజలు, 3న అమ్మవారి ఘటాల ఊరేగింపు, అనుపోత్సవం ఉంటాయన్నారు. 31వ తేదీ నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

విత్తనాలు అందేదెప్పుడు?

- సమీపిస్తున్న ఖరీఫ్..
- రాయితీల పేరుతో ఇబ్బందులు..
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

సరుబుజ్జిలి:

ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. ఇప్పటివరకు రైతులకు అందించాల్సిన విత్తనాల విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టతకు రాలేదు. దీనివలన రైతులు గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సుమారు 22,340 హెక్టార్లలో సాగుకు సమాయత్తమవుతున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో వరి సాగు (హెక్టార్లలో) వివరాలు ఇలా..

మండలం	ఆయకట్టు
సరుబుజ్జిలి	5,200
బూర్జ	5,080
ఆమదాలవలస	5,400
పొందూరు	5,640

సిద్ధంకాని విత్తనాలు..

రైతులకు అవసరమైన వరి విత్తనాలు వ్యవసాయాధికారులు ఇండెంట్ ప్రకారం ఇప్పటికే సిద్ధం చేసి రైతు సేవా కేంద్రాలకు పంపించాలి. ఇంతవరకు అధికారులకు, ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాల విషయంలో ఏమాత్రం స్పష్టతలేదు.

గిరాకీ విత్తనాల కొరత..

రైతులు అధికంగా సాగుచేసే స్వర్ణ, సాంబ విత్తనాల విషయంలో కొరత ఏర్పడుతుంది. గిరాకీలేని కొత్త వరి వంగడాలను కట్టబెట్టి రైతులపై ప్రయోగాలు చేయాలని ఈ ప్రభుత్వం చూస్తుంది. దీనివలన కొత్త వంగడాలను సాగుచేసిన రైతులుకు యాజమాన్య పద్ధతుల విషయంలో అవగాహన లేకపోవడంతొ తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రైవేట్ వ్యాపారుల హవా..

గిరాకీ ఉన్న విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా అరకొరగా అందిస్తున్నారు. ప్రతీ ఎకరాకు ఒక బస్తా పేరుతో నిబంధనలు పెట్టడం వలన రైతులకు సాగుకు సరిపోయినంత విత్తనాలు దొరకడం లేదు. దీంతో ప్రైవేట్ డీలర్లు విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి అధికంగా దోపిడీ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పక్క రాష్ట్రాల నుంచి నాణ్యతలేని విత్తనాలు తెచ్చి విక్రయిస్తున్నారు.

అన్ని రకాల విత్తనాలు అందించాలి



రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అధికంగా సరఫరా చేయాలి. గిరాకీ లేని విత్తనాలు కట్టబెట్టడం వలన ప్రయోజనం లేదు. దీని వలన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. రైతుల విషయంలో మొదటి నుంచి కూటమి ప్రభుత్వం కచ్చితంగా వ్యవహరించడం లేదు.

– పున్నపురెడ్డి తవిటినాయుడు, రైతు, మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

ధరలు తగ్గించాలి



రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ధరలు పెంచడం లేదు. విత్తనాల విషయంలో సబ్సిడీ అంటూనే మరో పక్క ధరలు అమాంతం పెంచేస్తున్నారు. దీనివలన రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. విత్తనాల ధరలు తగ్గించి కొరత లేకుండా ప్రతీ ఒక్కరికి పారదర్శకంగా అందించాలి.

– వందాన కృష్ణ, రైతు, రావివలస, సరుబుజ్జిలి మండలం

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



వరి విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వచ్చిన వెంటనే ఇండెంట్ ప్రకారం రైతు సేవా కేంద్రాలకు పంపిస్తాం.

– బి.పద్మనాభం, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి మండలం

మాజీ స్పీకర్‌ను కలిసిన కుంభా రవిబాబు



రవిబాబును సన్మానిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులు కంభా రవిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవిబాబును తమ్మినేని సన్మానించారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో పార్టీ పటిష్ఠతకు చేపట్టాల్సిన అంశాలను రవిబాబు తెలియజేశారు.

కార్డెన్ సెర్చ్



పాతపట్నం: రెల్లివీధిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



నరసన్నపేట: పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నంలోని రెల్లివీధిని గురువారం తెల్లవారు జామున 4 గంటలకు పోలీసులు చుట్టుముట్టి తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతాల ప్రజలు భీతిల్లారు. విషయం తెలుసుకుని ఇంటింటా తనిఖీలకు పోలీసులకు సహకరించారు. పాతపట్నం సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ, ముగ్గురు ఏఎస్ఐలు, పోలీసులు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఎస్ఐ బి.లావణ్య, పోలీసులు ఇంటింటికీ వెళ్లి ఆధార్, రేషన్, ఐడెంటీ కార్డులను పరిశీలించారు. వారి వివరాలను నమోదు చేసుకున్నారు. పత్రాలు సరిగా లేని నాలుగు ద్విచక్ర వాహనాలకు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి అక్రమంగా తరలించినా, అపరిచిత వ్యక్తులు కనిపించినా సమాచారం ఇవ్వాలన్నారు.

నరసన్నపేట పట్టణంలో..

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని పురుషోత్తంనగర్‌లో గురువారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వేకువజామున సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ఒక్కసారిగా పురుషోత్తంనగర్ కాలనీలోకి ప్రవేశించి మూకుమ్మడిగా తనిఖీలు చేపట్టడంతో స్థానికులు కొంత ఆందోళనకు గురయ్యారు. తరువాత విషయం తెలుసుకొని ఊపిరిపీల్చుకున్నారు. ఇంటింటికీ వెళ్లి అపరచితులు ఎవరైనా ఉన్నారా.. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పోలాకి, సారవకోట ఎస్ఐలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాటాలకు సీళ్లు తప్పనిసరి



పాతపట్నం: తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటాలకు సీళ్లువేస్తున్న అనురాధ

ఎల్.ఎన్.పేట: రేషన్ సరుకులు పంపిణీ చేసే డీలర్లు వారి కాటాలకు, ఈ-పాస్ యంత్రాలకు సీళ్లు తప్పనిసరిగా వేయించుకోవాలని ఈ-పాస్ విభాగం పర్యవేక్షకులు సాగర్, శ్రీధర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ-పాస్ యంత్రాలు, కాటాలకు సీళ్లు వేసే పనులు చేపట్టారు. ఇంతవరకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ జరిగాయని, జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి తూకం, కొలతల్లో తేడాలు లేకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీరితో పాటు శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలుంటే చర్యలు..

పాతపట్నం: రేషన్ సరుకుల కొలతల్లో తేడా వస్తే అటువంటి డీలర్లపై చర్యలు తప్పవని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ (నర్సీపట్నం) డి.అనురాధ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లలకు చెందిన కాటాలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రేషన్ డిపోలకు చెందిన డీలర్లు తమ కాటాలకు సీళ్లు తప్పకుండా వేసుకోవాలన్నారు. సీఎస్‌డీటీ బి.ప్రసాదరావు, టెక్నికల్ అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా


వెలుసోద యువత ఆదర్శం



మెట్లును ప్రారంభిస్తున్న జగన్నాథరావు

జలుమూరు: మండలంలోని పాగోడు పంచాయతీ వెలుసోద గ్రామం ఎస్సీ కాలనీ యువత పలువురికి ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది తండ్యేల జగన్నాథరావు అన్నారు. ఇటీవల యువత అంతా కలిసి వారి స్వంత నిధులతో చింతువాని చెరువుకు మెట్లు నిర్మాణం చేశారు. వాటిని గురువారం జగన్నాథరావు ప్రారంభించారు. సుమారు రూ.2 లక్షల నిధులు యువత పోగుచేసి అందరికీ ఉపయోగపడేలా మెట్లు నిర్మాణం చేపట్టడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో నవిరి జయరాం, అప్పన్న, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సినిమా హాల్స్‌లో తనిఖీలు



మరుగుదొడ్లను పరిశీస్తున్న రెవెన్యూ సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో ఉన్న నాలుగు సినిమా హాల్స్‌ను రెవెన్యూ సిబ్బంది గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఆర్డీఓ సాయి ప్రత్యూష ఆదేశాల మేరకు డీటీ శరత్, ఆర్ఐ సాయిరామ్ సినిమా హాల్స్‌లో మరుగుదొడ్లు, తినుబండారాలు పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తినిబండారాలు నాణ్యమైనవి విక్రయించాలన్నారు.

రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు

పాతపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాతపట్నంలో రైతు బజార్‌కు రెండు స్థలాలను పరిశీలించామని రీజినల్ డీడీఎం(విశాఖపట్నం) జి.శ్రీనివాస్ కిరణ్ అన్నారు. గురువారం మార్కెట్ కమిటీలో నగదు, చలానా వివరాల రికార్డులు, పలు రిజిస్టర్‌లను డీడీఎం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయన్నారు. పన్ను వసూళ్లలో గతేడాది కన్నా పాతపట్నం ఏఎంసీ మెరుగ్గా ఉందన్నారు. జిల్లాలో పన్ను వసూలులో నరసన్నపేట అగ్రస్థానంలో, కొటబొమ్మాళి రెండో స్థానంలో ఉన్నాయన్నారు. పాతపట్నంలో రైతు బజార్‌కు రెండు స్థలాలు పరిశీలించామని, రెవెన్యూ అధికారులు స్థలం కేటాయిస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. చెక్ పోస్టుల్లో పన్ను వసూలు, తనిఖీలను కార్యదర్శి రాజామోహనరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీడ్ శాంపిల్స్ సేకరణ

హిరమండలం: మండలంలోని కిట్టలపాడులో పొలంబడి కార్యక్రమం ద్వారా సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో రబీ సీజన్‌లో అపరాలు సాగు చేయడం జరిగిందని ఏఓ బి.సంధ్య తెలిపారు. సాగు చేసిన సీడ్ శాంపిల్స్‌ను గుంటూరు ఏపీఎస్ఓపీసీఏకు కొత్తూరు వ్యవసాయశాఖ ఉపసంచాలకులు రాజగోపాల్ ఆధ్వర్యంలో గురువారం పంపించినట్లు తెలిపారు. ఖరీఫ్‌లో సాగుచేసిన సీడ్స్‌ను కూడా గతంలో పంపించినట్లు ఏఓ తెలిపారు. (ఇండి గ్యాప్ సర్టిఫికేట్) ఇండియా గుడ్ అగ్రికల్చర్ పర్సన్ ధ్రువపత్రం కోసం సీడ్ శాంపిల్స్ పంపించినట్లు తెలిపారు. గ్యాప్ ధ్రువపత్రం పొందిన రైతులకు ప్రత్యేక మద్దతు ధరతో పాటు ఉత్తమ రైతుగా గుర్తింపు లభిస్తుందన్నారు.

ప్రతీ ఇంటి వద్ద కంపోస్ట్ పిట్ నిర్మించాలి

మెళియాపుట్టి: ప్రతీ ఇంటిలో రోజూ వచ్చే చెత్తను వేసుకోవడానికి కంపోస్టు పిట్ నిర్మించుకోవాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ప్రతీ ఇంటి వద్ద కంపోస్ట్ పిట్ తవ్వడానికి ఉపాధి వేతనదారులు ముందుకు రావాలని, స్థలం ఉన్న ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయకుండా అందులో వేస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. గ్రామాల్లో క్షేత్ర, సాంకేతిక సహాయకులు అవగాహన కల్పించాలన్నారు. ఫారంపాండ్స్ ప్రతీ రైతు తవ్వేలా చూడాలని, డ్వామా పీడీ ఇచ్చిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, ఏపీఎం త్రినాథమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

యాంత్రీకరణతో మేలు

ఆమదాలవలస: యాంత్రీకరణతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలసలోని కేవీకేలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడారు. వరిలో ఎరువులు, విత్తనాలు, వరి నాట్లు యంత్రం ద్వారా వేస్తే ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.ఉదయ్‌బాబు మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకొని సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో అమలుపరిచే వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. విస్తరణ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.ఎస్.రాయ్, డాక్టర్ బి.కిరణ్ గాంధీ, జాతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బి.హేమ, జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పి.హేమలత, ఆమదాలవలస వ్యవసాయశాఖాధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో వసతులు తప్పనిసరి

జలుమూరు: రేషన్ డిపోల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. గురువారం తిలారు ఆర్.ఎస్, బొడ్డపాడు రేషన్ డిపోలు తనిఖీ చేసి ఆయా డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా తూనిక యంత్రం, మినీ స్టోర్ ఏర్పాటుకు గది, గొడౌన్, ఇతర సాంకేతిక యాప్ వివరాలు అందులో పొందుపరచాలన్నారు. స్టాక్ రికార్డులు, సరుకులు సరి చూశారు. ఆర్ఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.